RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,
సంపుటి: 16 సంచిక 15 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శనివారం 18-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292



### మరోమారు రాజ్యసభ డిప్యూటి చైర్మన్‌గా
# హరివంశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్17 : రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.


2వ పేజీలో...

### మనస్సాక్షిగా మహిళా బిల్లుకు
# మద్దతు ఇవ్వండి
**మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం**
**మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం**

## ఎంపిలకు ప్రధాని మోడీ పిలుపు

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు.



### 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ
# చేపట్టండి
## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ, ఏప్రిల్17 : 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు.

2వ పేజీలో...

### 2023లోనే ఆమోదించిన బిల్లును
# అమలు చేయండి



- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా..కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు.

2వ పేజీలో...


2వ పేజీలో...

### కాళేశ్వరం ప్రాజెక్ట్
# పునరుద్దరణ
## బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్,ఏప్రిల్17 : కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది.



2వ పేజీలో...

### రెండోరోజూ నల్లదుస్తులతో..
# డిఎంకె సభ్యులు
## ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం

న్యూఢిల్లీ, ఏప్రిల్17 :మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎమ్‌కే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వరుసగా రెండోరోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు.


2వ పేజీలో...

### సిగాచీ బాధితులను నట్టేట
# ముంచారు
### కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం మరోమారు మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్17 : సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు.


2వ పేజీలో...

### నేషనల్ బ్రాండ్ గా..
# రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17, : తెలంగాణ రాజకీయ యవనికపై ఉవ్వెత్తున ఎగసిన కెరటం రేవంత్ రెడ్డి. ఇప్పుడు ఆ కెరటం కేవలం గండిపేట పరిధిలోనే ఆగకుండా, యమునా తీరం వరకు తన ప్రభావాన్ని చూపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే, కాంగ్రెస్ పార్టీలో ఆయన ఒక 'నేషనల్ బ్రాండ్'గా అవతరించారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర నాయకుడు కాదు.. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయ దిశను నిర్దేశించే వ్యూహకర్తగా అవతరిస్తున్నారు. ఆయన అడుగులు, ఆయన వ్యాఖ్యలు, ఆయన ప్రతిపాదనలు ఇవన్నీ ఇప్పుడు నేరుగా జాతీయ రాజకీయ చర్చను ప్రభావితం చేస్తున్నాయి. గత రెండేళ్లలో ఆయన ప్రదర్శించిన దూకుడు, వాక్చాతుర్యం, ఆలోచనలో స్పష్టత, నాయకత్వ శైలి, రాజకీయ టైమింగ్ అన్నీ కలిసి అయ్యి ఆయనను కాంగ్రెస్‌లో మాస్టర్ మైండ్‌గా నిలబెట్టాయి.

2వ పేజీలో...

# నేషనల్ బ్రాండ్ గా రేవంత్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో సాధారణంగా ఢిల్లీ నుంచి ఆదేశాలు రాష్ట్రాలకు అందుతాయి. కానీ, ఇప్పుడు సీన్ మారింది. హైదరాబాద్ నుంచి వెళ్తున్న ఒక ఆలోచన, ఒక నినాదం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి దిశానిర్దేశం చేస్తోంది. ఆ మార్పుకు కేరాఫ్ అడ్రస్ అనుముల రేవంత్ రెడ్డి. కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగానే కాకుండా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఒక శక్తివంతమైన వ్యూహకర్తగా, అజెండా సెట్టర్‌గా ఆయన ఎదుగుతున్న తీరు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజకీయాల్లో ప్రత్యర్థి వేసే ఎత్తులకు సమాధానం చెప్పడం ఒక ఎత్తు అయితే, ప్రత్యర్థి తన అజెండాపై మాట్లాడేలా చేయడం మరో ఎత్తు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సరిగ్గా ఇదే చేశారు. భారతీయ జనతా పార్టీ 400 సీట్ల నినాదం వెనుక రాజ్యాంగ మార్పు కుట్ర ఉందనే అంశాన్ని ఆయన బలంగా తెరపైకి తెచ్చారు. ఈ ఒక్క పాయింట్ దేశవ్యాప్త చర్చకు దారితీసింది, సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దీనిపై వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిస్పందన రాజకీయాల నుంచి ప్రతిఘటన రాజకీయాలకు కాంగ్రెస్‌ను మళ్లించడంలో రేవంత్ రెడ్డి విజయం సాధించారు. విపక్షాల ఐక్యతలో రేవంత్ రెడ్డి పాత్ర కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో తెలంగాణకు చెందిన మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి పేరును ప్రతిపాదించి, విభిన్న భావజాలం ఉన్న విపక్ష నేతలను ఒకే తాటిపైకి

మొదటిపేజీ తరువాయి...

తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ ఆయన డిప్లొమాటిక్ స్కిల్స్‌కు నిదర్శనం. ఇది ఆయనకు జాతీయ స్థాయి నేతలతో ఉన్న సత్సంబంధాలను, సమన్వయ కర్తగా ఆయనకున్న సామర్థ్యాన్ని చాటిచెప్పింది. తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశం ఉత్తరాది–దక్షిణాది రాష్ట్రాల మధ్య పెద్ద అగాధాన్ని సృష్టించే ప్రమాదం ఉంది. ఇలాంటి సున్నితమైన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' పార్టీ హైకమాండ్‌ను అమితంగా ఆకట్టుకుంది. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికి అన్యాయం జరగకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా సీట్ల కేటాయింపు ఎలా ఉండాలనే దానిపై ఆయన ఇచ్చిన క్లారిటీ, ఆయనలోని థింక్ ట్యాంక్‌ను బయటపెట్టింది. రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేల తర్వాత కాంగ్రెస్ శ్రేణుల్లో అత్యంత క్రేజ్ ఉన్న నాయకుడిగా రేవంత్ రెడ్డి దూసుకుపోతున్నారు. కేరళ నుంచి మహారాష్ట్ర వరకు ఆయన సభలకు వస్తున్న స్పందన చూస్తుంటే, ఆయన ఇప్పుడు కేవలం ఒక ప్రాంతీయ నేత కాదు. స్థానిక సమస్యలను జాతీయ అంశాలతో ముడిపెట్టి, సామాన్యుడికి అర్థమయ్యేలా చెప్పే ఆయన వాక్చాతుర్యం పార్టీకి పెద్ద ఆస్తిగా మారింది. రాజ్యాంగ పరిరక్షణ, ఫెడరలిజం, సామాజిక న్యాయం అనే మూడు స్తంభాల మీద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ నేరేటివ్‌ను నిర్మిస్తున్నారు. గ్రౌండ్ లెవల్ రాజకీయాల్లో ఎంత దూకుడుగా ఉంటారో, హైకమాండ్ గదుల్లో వ్యూహాల రచనలో అంతే నిశ్శబ్దంగా తన పని పూర్తి చేస్తారు. మునుపెన్నడూ లేని విధంగా ఒక దక్షిణాది ముఖ్యమంత్రి, ఏఐసీసీ విధాన నిర్ణయాల్లో ఇంతటి కీలక పాత్ర పోషించడం గమనార్హం. ఒకప్పుడు ఢిల్లీ కనుసన్నల్లో నడిచే నాయకులు ఉండేవారు. కానీ రేవంత్ రెడ్డి ఇప్పుడు ఢిల్లీకి దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగారు. రేవంత్ రెడ్డి అనే బ్రాండ్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఒక నమ్మకం, ప్రత్యర్థులకు ఒక సవాల్!

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు



మొదటిపేజీ తరువాయి...

ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

మొదటిపేజీ తరువాయి...

కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని,విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయనిరాహుల్‌గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగాలేదు. తన ప్రాబల్యంతగ్గిపోతోందన్న భయం ఆపార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలనుకున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి...

నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే పక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి‘ అనిప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం‘ అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా



## ఉత్తరాది, దక్షిణ్యాది పేరుతో విషం చిమ్ముతున్నారు

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

ఢిల్లీ,: ఏప్రిల్17 : దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

మొదటిపేజీ తరువాయి...

కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ. 1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో



వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# ట్రేడ్ లైసెన్సులు ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

## మున్సిపల్ కమిషనర్ రమేష్

ములుగు : ములుగు మున్సిపాలిటీలో పలు రకాల వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులందరూ విధిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని ములుగు మున్సిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులకు లైసెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడినందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ను వెంటనే పొందాలని, లైసెన్సులు పొందిన వారే వ్యాపారాలు చేసుకునే వీలు కల్పిస్తామని వివరించారు. నిర్దేశిత గడువులోగా ట్రేడ్ లైసెన్స్ పొందని, పునరుద్ధరించని వారి పై మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి...

మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

# ఆనాడు కులగణను ఎందుకు వ్యతిరేకించారు

## ఏప్రిల్ 17 కాంగ్రెస్ ఏమేం చేసిందో గుర్తు చేసుకోవాలి

## రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ నిశికాంత్ దుబె

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై జార్ఖండ్ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె విమర్శలు గుప్పించారు. కులగణనను కాంగ్రెస్ గతంలో వ్యతిరేకించిందన్నారు. కులాల ఆధారంగా జనగణన దేశాన్ని విభజిస్తుందని నాడు హస్తం పార్టీ వాదించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, లేకపోయినా కులగణన నిర్వహణ ఎప్పటికీ సాధ్యం కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇక ఏప్రిల్ 17 గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శనాస్త్రాలు సంధించారు నిషికాంత్. 'ఏప్రిల్ 17 గురించి రాహుల్ గొప్పగా చెబుతున్నారు. 1987లో బోఫోర్స్ కుంభకోణం వెలుగు చూసింది ఆ రోజేగా. అదే రోజునే సీతారామ్ కేసరి నుంచి సోనియా గాంధీ పదవి లాక్కున్నారు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పడగొట్టింది కూడా ఇదే తారీఖునే. మహిళలకు రిజర్వేషన్లు ఇస్తుంటే రాహుల్ తట్టుకోలేకపోతున్నారు. రాహుల్ ప్రసంగం పీసీ సర్కార్ మ్యాజిక్ షోలా సాగింది. మహిళా బిల్లు గురించి రాహుల్ మాట్లాడలేదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు' అని నిషికాంత్ దూబె అన్నారు.

# రెండోరోజూ నల్లదుస్తులతో డిఎంకె సభ్యులు

మొదటిపేజీ తరువాయి...

హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రోజుల వ్యవధిలో బిల్లులు ఆమోదింపచేసుకోవాలనే ప్రయత్నంలో రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇది అసలైన సమాఖ్య స్ఫూర్తి కాదని అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యంతరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

# సంపాదకీయం

## చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేడ్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేద్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే చరిత్ర క్షమించదు




రాష్ట్రంలో మన భారత రాజ్యాంగ పీఠిక అభాసు పాలవుతున్నది. పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వేదన కలిగిస్తున్నది. బాధ్యతాయుత ప్రభుత్వం చేయాల్సిన పని ఇలా కానే కాదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన కాళరాత్రులను ప్రజల జీవితాల్లోకి ప్రవహింప చేస్తున్నది. చట్టం ముందు అందర్నీ సమానంగా చూస్తామని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేసిన నాయకులు వాటిని గాలికొదిలేస్తున్నరు. ఎవ్వరూ చెప్పినా.. ఎంత చెప్పినా.. ప్రజల గగ్గోలు పెడుతున్నా... గోడు గోడమని గోస పడుతున్నా కనీసం కనికరించడం లేదు. ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చేస్తారో తెలియదు. ఎప్పుడు ఎక్కడ హైడ్రాపేరుతో బుల్డోజర్లు వస్తాయో తెలియని భయానక వాతావరణం నేడు రాష్ట్రంలో కన్పిస్తూ ఉన్నది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రజల ముందు ఉంచింది. ఏడో గ్యారెంటీగా భావప్రకటనా స్వేచ్ఛను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రజల ఆస్తులు కూలుస్తామని ఎనిమిదో గ్యారెంటీని చెప్పకుండా దాచుకున్నది. ఇప్పుడు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నదనే అనుమానం ప్రజల్లో కలిగేలా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వ్యవహార శైలి గురించి మరింత నిర్దుష్టంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీ అయిన ఆర్టికల్ 19, 21తో పాటు చట్టబద్ధమైన ఆస్తి హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. తమ జీవన భద్రతకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. 1973లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. అదే కేశవానంద భారతీ కేసుగా చరిత్రకెక్కింది. పౌరుల హక్కుల కంటే పార్లమెంట్, అసెంబ్లీ చేసిన చట్టాలు మహోన్నతమైనవి ఏమీ కాదని చెప్పింది. హైడ్రాపై అసెంబ్లీ ఆమోదముద్ర వేయించుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులను, వారి గౌరవ ప్రదమైన జీవితాలను ధ్వంసం చేసేహక్కు చట్టసభలకు ఉంటుందా? ప్రజల జీవితాలకు రక్షణ లేకుండా చేయాలని చట్టాలు చెప్తున్నాయా.? ప్రభుత్వం వహరిస్తున్న తీరు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధం కాదా? 1960-80 మధ్య కాలంలో భారత రాజ్యాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భం. ఎస్ఆర్ బొమ్మై కేసు, కేశవానంద భారతి కేసుతోపాటు చాలా కేసుల్లో న్యాయస్థానాలు చొరవ తీసుకోవడం వల్ల భారత ప్రజాస్వామ్య సజీవతకు బీజం పడింది. అంతేకాదు పౌరులు గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే ధైర్యాన్ని కూడా న్యాయస్థానాలు కల్పించాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహ రిస్తున్న తీరుపై కోర్టులు మొట్టికాయలు వేసినా తన తీరు మార్చుకో వడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇది ఇటీవల పరాకాష్టకు చేరింది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్లలో పేదలకు చెందిన వందలాది నివాసాలను ధ్వంసం చేసింది. ప్రజల పట్ల ప్రేమ లేకపోవడమే ఇందుకు కారణమా? లేకపోతే చట్టాల పట్ల గౌరవం లేకపోడమే కారణమా? తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారా? కాంగ్రెస్ పార్టీ తమది ప్రజాస్వామ్యయుత నేపథ్యం అని చెప్పకుంటుంది. కానీ చర్యలు మాత్రం దానికి భిన్నంగా ఉంటాయి. భవిష్యత్తు అభివృద్ధి కోసమని గడిచిన ఏడు దశాబ్దాలుగా ఇక్కడి పేదలకు జీవనాధారమైన భూములు కోల్పోయారు. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడి వారు మాత్రం మౌలిక సదుపాయాల కోసమని, నైట్‌మార్కెట్ కోసమని నివాసాలను, భూములను కోల్పోతున్నారు. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రకారం ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు, వ్యా పారాలు చేసుకోవచ్చు. నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఇతరుల కోసం తరాలకు తరాలు ఆస్తులు కోల్పోవడాన్ని రాజ్యాంగం సమర్థిస్తుందా? ఇక్కడి పేదలను నిలువునా ముంచుతామని అంటే నిర్దేశిత చట్ట నియామాలు మౌనంగా ఉంటాయా? ఎలాంటి అభివృద్ధి అయినా సరే విధ్వంసం, విస్తాపనకు ప్రత్యామ్నాయాలు లేనే లేవా? ఈ తీరులో పాలకులు ఎందుకు ఆలోచించడం లేదు? మూసీ సుందీకరణ కోసం సుమారు యాభై కిలోమీటర్ల మేర లక్షలాది నివాసాలను ధ్వంసం చేస్తామని అంటే ఎట్లా ఊరుకోవాలి? చిన్నచిన్న పనులు చేసుకొని పొట్ట పోసుకుంటున్న బడుగు జీవుల గూళ్లను చెదరగొడ్తామంటే ఎట్లా? మధ్యతరగతి వారి జీవితపు కలం సొంత ఇల్లు. బ్యాంకు లోన్లు తీసుకొని ఏండ్లకు ఏండ్లు కిస్తీలు కట్టుకుంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తామంటే ఎట్లా? ప్రైవేటు రంగంలో జీవన భద్రతకు గ్యారెంటీ లేదు. అప్పుల మధ్యనే జీవితం సాగుతూ ఉంటుంది. అలాంటి వారికి రేపటి నుంచే మీ ఇండ్లు ఉండవు పోండి! అంటే వారు ఎక్కడ తలదాచుకోవాలి? జీవితం అల్లకల్లోలం అవుతున్నట్టే కదా? తాజాగా సంగారెడ్డిలో హైడ్రా కూల్చివేతల గురించి మీడియాలో వీడియోలు చూస్తే భయాందోళనలు కలుగుతున్నాయి. కూల్చే యంత్రానికి హృదయం లేదు. కానీ పైనుంచి ఆదేశాలిచ్చే వారికి, వాటిని అమలు చేసే వారికి హృదయం ఉంటుంది కదా? అది పనిచేయడం లేదు ఎందుకు? లేకపోతే అధికారానికి కండ్లు ఉండవు, సంపదకు ఆత్మ ఉండదనే నానుడిని నిజం చేస్తున్నారా? ఎవరెట్లా అనుకున్నా తాము అనుకున్న విధంగా ముందుకెళ్తామనే ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారా? కాంగ్రెస్ పాలనలో కూల్చడం తప్పా నిర్మించడం ఎక్కడైనా ఉన్నదా? కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమున్నదని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అంతా తమ ఇష్టం అనే భావనతో పాలకులు ఉంటే గనుక ముమ్మాటికీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టే, పౌరుల జీవన భద్రతను గాలికి వదిలేసినట్టే.. భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నట్టే. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలక పెద్దలు తప్పును సరిచేసుకోకుంటే చరిత్ర అస్సలు క్షమించదు.

## మొక్కజొన్న సబ్‌సెంటర్లకు గ్రీన్ సిగ్నల్



భైంసా (తెలంగాణ వాణి): మొక్కజొన్న కొనుగోలుకు సబ్‌సెంటర్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అవసరమైన చోట్ల అదనపు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు.

హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డిని కలిసి ముధోల్ నియోజకవర్గంలో సబ్‌సెంటర్ల అవసరాన్ని వివరించినట్లు చెప్పారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో క్వింటాలుకు సుమారు రూ.700 వరకు అధిక ధర లభించే అవకాశం ఉందని తెలిపారు. ముధోల్‌లో 30కి పైగా సబ్‌సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్ముకోవాలని సూచించారు.

## తెలంగాణను అవమానించిన భాజపా ఎంపీ తేజస్వి వెంటనే క్షమాపణ చెప్పాలి

**బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ కార్యదర్శి కుప్పల నిరంజన్**



చర్ల (తెలంగాణ వాణి) తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చి అవమానకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల యూత్ కార్యదర్శి కుప్పల నిరంజన్ డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం అవివేకమైన చర్య అని, ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని తీవ్రంగా ఖండించారు.పార్లమెంట్‌లో జరిగిన ఈ సంఘటనపై మాట్లాడిన కుప్పల నిరంజన్, "తెలంగాణ పోరాటం పవిత్రమైనది. దాన్ని ఇలా అవమానించడం మాత్రమే కాక, ప్రజల మనోభావనలను గాయపరుస్తుంది" అని అన్నారు. అలాంటి వ్యాఖ్యలు విన్నప్పటికీ తెలంగాణకు చెందిన ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ పార్టీ కూడా తన ఎంపీ వ్యాఖ్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ఈ సంఘటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో వ్యాప్తి చెందుతోంది. బీఆర్ఎస్ నాయకులు దీనిపై మరిన్ని నిరసన కార్యక్రమాలు ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

# జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

## మండలంలో నిర్మాణం అవుతున్న పలు భవనాల పరిశీలన



జగిత్యాల /బుగ్గారం :17 ఎప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి ): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం తో పాటు యశ్వంతరావు పేట గ్రామంలో శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. యశ్వంతరావుపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బుగ్గారంలోని ఎదుల బోర్లలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, మూడు గ్రామల సమైక్య భవనాల నిర్మాణం, తహసిల్దార్ మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులను, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఆయా కాంట్రాక్టర్ లతో, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో, సంబంధిత శాఖల అధికారులతో ఆయన మాట్లాడాతూ నిర్మాణ పనులు త్వరగా, నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులు కూడా త్వరలోనే అవుతాయని, పనులు ఆలస్యం కాకూడదని తెలిపారు.డీఆర్డీఏ పిడి రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ గౌడ్, మండల తహసీల్దార్ భూమేశ్వర్, ఇంచార్జ్ ఎంపిడివో అనుమల్ల వాసవి, ఎపిఎం రమాదేవి,వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ, ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులు బెజ్జారపు రాజు, పంచాయతీ కార్యదర్శి అక్బర్, విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, విడిసి కోర్ కమిటీ చైర్మన్ పెద్దనవేని రాగన్న, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సా గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల సాధనకు నల్ల బ్యాడ్జిలతో నిరసన

రాయికోడ్ :ఏప్రిల్ 17(తెలంగాణ వాణి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం నాడు టిజిఈ జెఏసి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పిఆర్సి అమలు కోరుతూ సీపీఎస్ అంతం ఒపీఎస్ అమలు కోరుతూ ఉపాధ్యాయులు పాఠశాలల ప్రాంగాణాలలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు.

ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒపీఎస్ అమలు చేసి చిత్త శుద్ధి చాటుకోవాలని అన్నారు.అనంతరం మండల తహసీల్దార్కు మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్,జిల్లా బాద్యులు విజయ్ కుమార్,మండల శాఖ అధ్యక్షులు యాదవులు,కార్యదర్శి పాండురంగారెడ్డి,ఉపాధ్యాయులు ఖైరత్ ఆలీ,వినోద,శివ లక్ష్మి, జ్యోతి,నటరాజ్,రాజమల్లేశం, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.




## కలివేరులో ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చేయండి



**ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర**

చర్ల (తెలంగాణ వాణి ప్రతినిధి): చర్ల మండలం కలివేరు గ్రామ పంచాయతీలో ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర డిమాండ్ చేశారు.రాజు దొర మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా ఆదివాసీ మహిళలకు జీవనోపాధి అవకాశాలు కల్పించాలని, తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ, భద్రాచలం ఐటిడిఏ ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సహకారం లేకపోతే ఆదివాసీ మహిళలు ప్రైవేట్ కాంట్రాక్టర్లు, బినామీలు, బ్రోకర్లు, గిరిజనేతరుల ఆధారంగా మోసాలకు గురవుతారని హెచ్చరించారు. ఈ విషయంపై భద్రాచలం ఐటిడిఏ పీవో ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

## జనగణన శిక్షణ ఏర్పాట్ల పరిశీలన



రాయికల్:ఏప్రిల్ 17(తెలంగాణ వాణి): ఈ నెల 18 వ తేదీ నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లకు మరియు సూపర్ వైజర్లకు మొదటి విడతలో భాగంగా మే 11వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టే ఇండ్ల గణనపై నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను తహసీల్దార్ నాగార్జున పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ మండలానికి సంబంధించి 81 మంది ఎన్యూమరేటర్లు,13 సూపర్ వైజర్లకు మూడు దశలుగా (18-29 ఏప్రిల్) అందించే శిక్షణలో జనగణనకు చెందిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని,శిక్షణను విజయవంతం చేయాలని,ప్రజా ప్రతినిధులు గ్రామాల్లోని ప్రతి ఇంటి వివరాలను నమోదు చేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ ట్రైనర్ కడకుంట్ల అభయ్ రాజ్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గట్టు రమేష్ నర్సయ్య,ఉపాధ్యాయులు మహేశ్వర శర్మ,తరంగిణి,పుర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అధికార వ్యూహం..‘పునర్విభజన’



హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కొచ్చిలో నివసించే ఒక మధ్య తరగతి కుటుంబం గురించి ఆలోచిద్దాం. ఆ కుటుంబం కష్టపడి పనిచేస్తున్నది. పిల్లలను మంచి పాఠశాలకు పంపిస్తున్నది. కుటుంబ నియంత్రణతో జీవిస్తున్నది. పన్నులను నిజాయతీగా చెల్లిస్తున్నది. ఆయానగరాలు కలిగిన రాష్ట్రాలుమంచి దవాఖానలు కలిగి ఉన్నాయి. పరిశ్రమలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. రాష్ట్రంలోని పరిమితమైన నీరు, భూమికి తగినట్టుగా జనాభా తక్కువగా ఉన్నది. జీవన విధానాలు అద్భుతంగా, పరిపూర్ణంగా లేకపోయినా, ప్రజలు మంచి విద్యావంతులై, క్రమశిక్షణ కలిగి జీవిస్తున్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మిస్తున్నారు. కానీ ఇప్పుడు అలాంటి ప్రశాంతమైన సమాజంలోకి ఢిల్లీ నుంచి ఒక పెద్ద మార్పు రాబోతున్నది. దాని పేరు డీలిమిటేషన్. కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొస్తున్న డీలిమిటేషన్ సాంకేతికంగా ఒక పదంగా కనిపించవచ్చు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 850కి పెంచాలని కసరత్తు చేస్తున్నది. రాష్ట్రాల జనాభా ఆధారంగా నియెజకవర్గాల పునర్విభజన ద్వారా ఎంపీల సంఖ్యను పెంచనున్నది. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ మంది ఎంపీలు, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలకు తక్కువ మంది ఎంపీలు దక్కుతారు. ఈ పరిణామం దక్షిణాది సాధారణ ప్రజలకు ఇది తీవ్రమైన అన్యాయంగా కనిపిస్తున్నది. ఎందుకంటే జనాభా నియంత్రణలో భాగంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దశాబ్దాలుగా చేపట్టిన కుటుంబ నియంత్రణ దక్షిణాది రాష్ట్రాల్లో విజయవంతంగానడిచింది. ఉత్తరాదిరాష్ట్రాలప్రజలు ప్రభుత్వాల సూచనలను లెక్కచేయకపోవడం వల్ల అక్కడి జనాభా దక్షిణాదితో పోల్చితే ఎక్కువగా పెరిగింది. ఇప్పుడు జనాభా ఆధారంగా ఎంపీ సీట్లు కేటాయిస్తామంటే దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్ల కేటాయింపు జరగకపోవచ్చు.ఫలితంగా దేశంలోఆయా రాష్ట్రాల ప్రభావం తగ్గవచ్చు. మెరుగైన జీవనం, క్రమశిక్షణ కలిగిన విధానం, గర్వపడే అభివృద్ధికే శిక్ష విధించినట్టుగా దక్షిణాది ప్రజలు భావించాల్సి వస్తున్నది. ప్రస్తుతం లోక్‌సభ సీట్లు 543. ప్రతీ ఎంపీ నియోజకవర్గంలోని ఒకే ప్రజల సంఖ్య దాదాపు సమానం అనుకోవచ్చు. కానీ దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను సమర్థంగా నియంత్రించాయి. ఇప్పటికే ఉత్తరాదితో పోల్చితే దక్షిణాది రాష్ట్రాల్లోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువ. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో జనాభా నియంత్రణలో ఉండటం, ప్రతీ నియోజకవర్గానికి సగటు ఓటర్ల సంఖ్య ఎక్కువ ఉండటం కొంచెం గందరగోళంగానే అనిపిస్తుంది. కానీ ఇది నేటి వాస్తవ పరిస్థితి. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గానికి సగటున 18 లక్షల నుంచి 22 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ సంఖ్య సగటున 14 లక్షల నుంచి 16 లక్షల మధ్య ఉన్నది. కేంద్రం చెప్తున్న లోక్‌సభ సీట్ల పెంపు పట్ల దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. అంటే, సీట్ల సంఖ్య పట్ల కాదు, కేంద్రం రాజకీయ ఉద్దేశాల పట్లనే ఈ ఆందోళన. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినా సామాజిక బాధ్యత కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడంలో ప్రజలు మెరుగైన భాగస్వామ్యం కనబర్చారు. బాలికల విద్య, చిన్న కుటుంబాలను ప్రోత్సహించడం, బలమైన ఆర్థిక వ్యవస్థల నిర్మాణం పట్ల శ్రద్ధ చూపారు. కేరళం అక్షరాస్యత శాతం 96%. తమిళనాడులో ప్రపంచస్థాయి పరిశ్రమలు ఉన్నాయి. కర్నాటకలోని ఐటీ రంగ అభివృద్ధి దేశ ఐటీబూమ్‌కు కారణంగా నిలుస్తున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఫార్మా, వ్యవసాయ రంగాల ఉత్పత్తులకు నిలయాలుగా నిలుస్తున్నాయి. దక్షిణాది మహిళ సగటున సంతానోత్పత్తి రేటు 1.6–1.7 కాగా ఉత్తరాదిలో ఈ సంఖ్య 2.4–3గా ఉన్నది. దేశంలోని జీఎస్టీ వసూళ్లలో దక్షిణాది రాష్ట్రాల వాటా 31 శాతం. కానీ దక్షిణాది రాష్ట్రాలు చెల్లిస్తున్న పన్నుల్లో సగం కూడా కేంద్రం నుంచి తిరిగి కేటాయింపులు జరగడంలేదు. కేవలం జనాభా ఆధారంగా మాత్రమే లోక్‌సభ సీట్ల పెంపు జరిగితే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల గొంతు కుచించుకుపోతుంది. ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్లు 130 అంటే దాదాపు 23 శాతం. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఇది 18 శాతం కంటే కూడా తక్కువకు పడిపోయే అవకాశమున్నది.

తెలంగాణ సమాచారం: ఎంపీల కేటాయింపు అనేది కేవలం సంఖ్యాపరమైనది కాదు. ఇది న్యాయానికి సంబంధించిన వ్యవహారం. దశాబ్దాలుగా దక్షిణాది ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా కుటుంబ నియంత్రణ, బాలికా విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై శిబిరాలు నిర్వహించాయి. ఇవన్నీ కూడా దేశానికి మేలు చేసే అంశాలు అని ప్రచారం నిర్వహించాయి. కానీ వాటన్నింటినీ సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించినందుకు లభిస్తున్న బహుమానం ఏంటంటే ఎంపీ సీట్ల కేటాయింపు, రాజకీయ అధికారంలో అన్యాయం. ఎక్కువ పిల్లల్ని కనండి, ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయంటూ ఉత్తరాది నేతలు బహిరంగ సభల్లో తరచుగా మాట్లాడుతూ ఉంటారు. ఈ మాటలు ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తాయి. భారత్‌ను సుస్థిరంగా ఉంచేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించే ప్రజలను నిరుత్సాహపరుస్తాయి.

దక్షిణాదిలోని ప్రజలు ఈ అన్యాయాన్ని తమ రోజువారీ జీవితంలోనూ చూస్తున్నారు. దక్షిణాదిలో వసూలు చేసిన పన్నులతో ఉత్తరాదిలో రహదారులు, పాఠశాలలు నిర్మిస్తుంటే ఇక్కడి నగరాల్లో ట్రాఫిక్, నీటి ఎద్దటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇక తక్కువ మంది ఎంపీలు అంటే దక్షిణాది రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం మరింత పెరగడమే అవుతుంది. పరిశ్రమల కేటాయింపు నుంచి రైతులకు న్యాయమైన ధరల అందించడం వరకు ప్రతీ విషయంలో అన్యాయం ఎదుర్కోవాల్సి వస్తుంది. అంటే దక్షిణాది ప్రజలు ‘ఎక్కువ పని చేస్తాం, ఎక్కువ పన్నులు చెల్లిస్తాం, కానీ దేశ పాలనలో మాటకు విలువ తక్కువ’ అనుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను న్యాయంగా జరుపుతామని, ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. ఈ మాటను తెలంగాణ లోని బీఆర్‌ఎస్, తమిళనాడు నుంచి డీఎంకే, కర్నాటక కాంగ్రెస్ నేతలు నమ్మడం లేదు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ బిల్లు ఇప్పటికీ అమలు చేయడం లేదని గుర్తుచేస్తున్నారు. ఆ బిల్లు అమలు చేసిన తర్వాతనే డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లు ప్రతులను తమిళనాడు సీఎం స్టాలిన్ కాల్చి, నిరసనను తెలిపారు. కేంద్రంలోని బీజేపీ రాజకీయ ఉద్దేశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాదిలో ఎక్కువగా ఎంపీ సీట్లు పెంచుకోవడం ఆ పార్టీ ఉద్దేశం అని నిపుణులు చెప్తున్నారు. దక్షిణాదిలో బీజేపీ ప్రాబల్యం తక్కువ. కాబట్టి ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి తమకు బలం ఉన్న రాష్ట్రాల్లో గెల్చుకునే సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావాలనేది బీజేపీ రాజకీయ జిమ్మిక్కు, అప్రజాస్వామిక వైఖరి అని అభివర్ణిస్తున్నారు. తమకు ఓటు వేయని ప్రాంతాల గొంతు నొక్కి, తమకు మద్దతుగా నిలిచే వారి స్వరం పెంచడం ద్వారా అధికారం చెలాయించాలని చూడటం దారుణమని మండిపడుతున్నారు. ఆటలో గెలవడం చేతగాక, ఆట నిబంధనలు మార్చినట్టుగా బీజేపీ తీరు ఉన్నదని చెప్తున్నారు. ఇదంతా ఎన్నికల సంస్కరణ ముసుగులో అధికారాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న వ్యవహారం అని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు.కేంద్రం తెరపైకి తీసుకొస్తున్న సమస్యకు పరిష్కారం ఏమిటి? అంటే.. దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేక సదుపాయాలు కోరడంలేదు. సమతుల్యమైన సూత్రాన్ని పాటించాలని మాత్రమే అడుగుతున్నారు. జనాభాను ప్రాతిపదికగా తీసుకోవచ్చు, అదే సమయంలో అభివృద్ధిని కూడా పరిగణలోకి తీసుకోవాలి. అక్షరాస్యత, ఆర్థిక భాగస్వామ్యం, కుటుంబ నియంత్రణలో సత్ఫలితాలు వంటి అంశాలను లెక్కలోకి తీసుకోవాలి. జనాభాకు 50 శాతం, అభివృద్ధి సూచీలకు 50 శాతం ప్రాధాన్యత కల్పిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని మరికొందరు నిపుణులు సూచిస్తున్నారు. జనాభాకు సంబంధం లేకుండా రాజ్యసభను బలోపేతం చేయడం ద్వారా కూడా రాష్ట్రాలు తమ గొంతును వినిపించేందుకు అవకాశం కల్పించవచ్చు. ఒక మనిషి -- ఒక ఓటు అనే సూత్రం ప్రకారం లోక్‌సభ సీట్ల పునర్విభజన అవసరమే. కానీ దేశం మొత్తానికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించినట్టుగా ప్రక్రియ ఉండకూడదు. అభివృద్ధి చెందిన, విద్యావంతమైన దక్షిణాది ప్రపంచంతో పోటీ పడుతున్నది. అలాంటి దక్షిణాది అసంతృప్తితో ఉంటే ‘ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్’ అని కేంద్రం చెప్తున్న మాటలకు అర్థం ఉండదు. దక్షిణాదిలోని ప్రజలు ఉత్తరాది ప్రజలకు వ్యతిరేకం కాదు. దేశంలోని ప్రతి ఒక్కరికీ మంచి విద్య, వైద్యం అందాలని దక్షిణాది ప్రజలు కోరుతున్నారు. కానీ దక్షిణాది ప్రజల కఠోర శ్రమ, బాధ్యతాయుత కార్యక్రమాల అమలుకు గౌర వం ఆశిస్తున్నారు, శిక్షను కాదు. కేంద్రం తప్పనిసరిగా వినాల్సిందే. నియోజకవర్గాల పునర్విభజన అనేది సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయాలి, బలహీనపర్చవద్దు. సుపరిపాలనకు అభినందించాలి, శిక్షించకూడదు. దక్షిణాది మనోభావాలను, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా కేంద్రం ఒంటెత్తు పోకడలతో ముందుకు వెళ్తే ఇక్కడి ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. అది ఎవరికీ మంచిది కాదు, దక్షిణాది రాష్ట్రాలు అడుగుతున్నది ఏంటి? తమ గొంతు వినిపించేందుకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం. ప్రజాస్వామ్యంలో ఇది అత్యాశ అవుతుందా? బీజేపీ మాటలు ప్రజల్లో నమ్మకం కలిగించట్లేదు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేస్తే అభివృద్ధికి శిక్ష వేసినట్టు అవుతుంది. దక్షిణాది ప్రజలు చెల్లిస్తున్న పన్నుల వాటాకు తగ్గట్టుగా సుపరిపాలన కావాలని కోరుకుంటారు. అందుకోసం తమ గొంతు వినిపించాలని ఆశిస్తారు. డీలిమిటేషన్ కోసం జనాభా ప్రాతిపదికతో పాటు, మానవ అభివృద్ధి సూచీలను పరిగణలోకి తీసుకోవాలి, మహిళా రిజర్వేషన్‌ను అనుసంధానం చేయాలి. సబ్ కా సాత్ అంటే ఉత్తరాదిలోని అందరితో కలిసి అనేలా ఉండొద్దు. దక్షిణాదినీ భాగస్వామ్యం చేయాలి. మనుషులను లెక్కించడమే కాదు, మనుషుల కృషిని గుర్తించినప్పుడే సమతుల్యత సాధ్యమవుతుంది, ఈ కేంద్రం గుర్తించాలి. దేశం కోసం కృషి చేసే వారిని గౌరవించాలి, శిక్షించకూడదు.

# సింహాచలం భక్తుల భద్రత కోసం ఏఐ



విశాఖపట్టణం, : సింహాచలం అప్పన్న ఆలయంలో చందనోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఏప్రిల్ 20న చందనోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత.. ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తుల భద్రత కోసం తొలిసారిగా ఏఐ వినియోగించనున్నట్లు అనిత తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.సింహాచలం చందనోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సింహాచలం అప్పన్న ఆలయంలో ఏప్రిల్ 20వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో భక్తులకు నిజరూప దర్శనం టికెట్లు జారీ చేస్తున్నారు. చందనోత్సవానికి ఈ ఏడాది సుమారుగా రెండు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. భక్తుల భద్రత కోసం సింహాచలం ఆలయంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.మరోవైపు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ ఏడాది సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. సామాన్య భక్తుల దర్శనానికి పెద్దపీట వేయను న్నట్లు అనిత తెలిపారు. ఆరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచే సింహాచలం ఆలయంలో దర్శనాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తొలిసారిగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వంగలపూడి అనిత వెల్లడించారు.అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింహాచలం కొండపై పది చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని.. నిరంతరాయంగా మజ్జిగ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి అనిత తెలిపారు.రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్‌ఎఫ్ , ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను ఆలయం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, స్వామివారి నిజరూప దర్శనం , ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్? హోం మంత్రి వివరించారు. సింహాచలం చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.మరోవైపు చందనోత్సవం సందర్భంగా సింహాచలంలో గంధం అరగతీత కార్యక్రమానికి శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల సాక్షిగా ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆలయ ఆచారం ప్రకారం గంధం అరగతీత కార్యక్రమం మూడు రోజులు కొనసాగుతుంది. గంధం అరగతీత కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు.

# మెట్రోతో మినీ ఎలక్ట్రిక్ బస్సుల లింక్



హైదరాబాద్, : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా మెట్రో స్టేషన్ల నుంచి మినీ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా.. త్వరలోనే మినీ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఎలక్ట్రిక్ బస్సులే నడుస్తుండగా.. వాటిని ఛార్జ్ చేసేందుకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆర్టీసీ రెడీ అయింది.హైదరాబాద్ మెట్రో ప్రతి నిత్యం దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది. నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకోవాలంటే చాలా మంది మెట్రో ట్రైన్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ మెట్రో సేవలు నగర వ్యాప్తంగా లేకపోవటంతో చాలా మంది మెట్రో దిగిన తర్వాత తమ తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. అయితే చాలా వరకు మెట్రో స్టేషన్ల సమీపంలో బస్టాండ్లు అందుబాటులో ఉండటం లేదు. చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు ఫీడర్ సర్వీసులుగా మినీ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఈ మినీ ఎలక్ట్రిక్ బస్సులను సమీప కాలనీలకు నడపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి.ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రధాన టెర్మినల్ పాయింట్లు అయిన పటాన్‌చెరు, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, వనస్థలిపురం, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కాలనీ, చిలకలగూడ, బాలానగర్, మెహిదీపట్నం, గండిమైసమ్మ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్‌స్టేషన్లు అవసరమని తాజాగా ఆర్టీసీ అదికారులు గుర్తించారు. ఇందుకు 1500 నుంచి 2500 చదరపు మీటర్ల చొప్పున భూమి కావాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. సూచించిన ఆయా ప్రాంతాల్లోని భూములను గుర్తించి జాబితా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆర్టీసీ యాజమాన్యం కోరింది.ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సమయంలో లేదా టెర్మినల్ వద్ద ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్లు 10 నుంచి 20 నిమిషాలు పాక్షికంగా బ్యాటరీని ఛార్జ్ చేస్తాయి. దీనినే అపర్చునిటీ ఛార్జింగ్ అని అంటారు. బస్సు రూట్ చివరి పాయింట్ లేదా మధ్యలోని ప్రధాన స్టాప్‌ల వద్ద వీటిని అందుబాటులోకి తీసుకొస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 300 నుంచి 600 కిలోవాట్ హై పవర్ ఛార్జర్లు ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా ఛార్జ్ చేయనున్నాయి. వీటితో పాటు అన్ని బస్సులు ఒకేసారి రాత్రి డిపోలో ఛార్జ్ చేస్తే విద్యుత్ గ్రిడ్‌పై భారం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ కేంద్రాలతో ఆ ఇబ్బంది తొలిగిపోనుంది. ఆర్టీసీ బస్సు డిపోకు తిరిగొచ్చిన తర్వాత పూర్తిగా ఛార్జ్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. టెర్మినల్‌లో 10 నుంచి 15 నిమిషాల లేఓవర్‌లోనే టాప్‌అప్ చేసుకొని మళ్లీ ఆయా రూట్‌లోకి వెళ్లొచ్చు. దీని వల్ల బస్సులను ఎక్కువ ట్రిప్పులు తిప్పటానికి అవకాశం ఉండటంతో పాటు సుదూర మార్గాల్లో ప్రయాణ సేవలు అందించొచ్చు.

# జగిత్యాలలో గురుశిష్యుల మధ్య పోరు

కరీంనగర్, ఏప్రిల్ 17, : కాంగ్రెస్ సీనియర్ నేత.. నాలుగు దశాబ్దాలుగా ఆ పార్టీలో కొనసాగిన కురవృద్ధుడు.. శేష జీవితం ప్రశావంతంగా గడుపుతానని ప్రతీ ఎన్నికల్లో ఇవే నాకు చివరి ఎన్నికలు అంటూ ప్రకటిస్తూ.. ఓటమి చవి చూస్తున్న జీవన్‌రెడ్డి.. ఇటీవలే హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు.

బీఆర్‌ఎస్ నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేదు. పార్టీ మార్పిడి నిర్ణయం జగిత్యాల జిల్లా రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టించింది. 1990 నుంచి జిల్లాలో ఆయన ప్రభావం ఎమ్మెల్యే టికెట్ల నుంచి మంత్రి పదవుల వరకు విస్తరించింది. ఈ చర్యతో స్నేహితులు విడిపోతూ, ప్రత్యర్థులు బలపడుతున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నికల్లో విజయవంతమైన అనేక మంది ఇప్పుడు కొత్త మార్గాలు వెతుకుతున్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు తాజా రాజకీయ పరిణామాలు సంక్లిష్టంగా మారాయి. జీవన్ రెడ్డిని గురువుగా గౌరవించి, 2018 ఎన్నికల్లో ఆయన సపోర్ట్‌తో విజయం సాధించిన లక్ష్మణ్‌కుమార్ ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు గురువుపై విమర్శలు చేయాల్సి వచ్చింది. గురువు మార్గదర్శనాన్ని వదులుకుని పార్టీకి లాయల్టీ చూపితే, స్థానిక ప్రజల సపోర్ట్‌లో లోటు పడవచ్చు. లేకపోతే, పార్టీలో స్థానం కోల్పోయే ప్రమాదం. ఈ సంక్లిష్ట పరిస్థితి అడ్లూరి రాజకీయ కెరీర్‌ను మలుపు తిప్పుతోంది.జీవన్‌రెడ్డి చర్య జగిత్యాలలో అధికార పద్ధతులను కుదిపిస్తోంది. బీఆర్‌ఎస్ ఈ విభేదాలను ఉపయోగించుకుని, స్థానిక అసంతృప్తి వర్గాలను తనవైపు మళ్లించుకుంటోంది. బీజేపీ కూడా కొత్త మైదానాలు తెరుస్తోంది. గత ఎన్నికల్లో జీవన్ ప్రభావంతో కాంగ్రెస్ బలపడినా కొన్ని మండలాలు ఇప్పుడు అనిశ్చితంలో ఉన్నాయి. వీటిని తనవైపు తిప్పుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో రాయికల్ మున్సిపాలిటీలో బీజేపీ పట్టు సాధించడమే ఇందుకు నిదర్శనం.గురు?శిష్యుల మధ్య ఈ ఉద్రిక్తత ఓ పూర్తి రాజకీయ యుద్ధానికి దారితీస్తుందా అనేది కీలక ప్రశ్న. జీవన్ రెడ్డి కొత్త పార్టీలో బలపడి, స్వతంత్ర అభ్యర్థులను ప్రోత్సహిస్తే, అడ్లూరి వర్గాలు విడిపోతాయి. అయితే, రహస్య సమావేశాల ద్వారా సమాధానం కనుక్కుంటే, జిల్లా రాజకీయాలపై అడ్లూరి పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మంత్రిగా కూడా ఉన్న నేపథ్యంలో ఆయన నిర్ణయాలు ఇప్పుడు పార్టీకి దిశానిర్దేశం కానున్నాయి.

# మరింత పెరిగిన బంగారం ధర



హైదరాబాద్,ఏప్రిల్17 :భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ. 3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది.

ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,74,900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,56,670గా ఉంది. ముంబైలో రూ. 1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ. 1,55,730 వద్ద కదలాడుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర చెన్నైలో రూ. 1,43,610గా, ముంబైలో రూ. 1,42,610గా, న్యూఢిల్లీలో రూ. 1,42,760గా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ. 2.69 లక్షల నుంచి రూ. 2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# వైట్ పాయిజన్స్‌తో ఆరోగ్యానికి పొంచి ఉన్న ముప్పు

తీపి-ఉప్పు-తెల్లబియ్యం.. డయాబెటిస్, బీపీకి మూలం అని డాక్టర్స్ పోషకాహార నిపుణులు అంటున్నారు. వీటికి బదులు ఆరోగ్యకర ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సలహా ఇస్తున్నారు. పూర్వీకులు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించేవారు. నేడు 25 ఏళ్లు దాటక ముందే రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి, కారణం మన ఆహారంలో ఎక్కువగా వాడే మూడు పదార్థాలు. చక్కెర, ఉప్పు, తెల్లబియ్యం ఈ మూడు పదార్థముల వలన అనర్థాలు ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు. వీటిని వైట్ పాయిజన్స్‌గా పేర్కొంటున్నారు. ఉన్న రోగాలు తగ్గాలన్నా, కొత్తవి రాకుండా ఉండాలన్నా, వీటి వినియోగంతగ్గించాలంటున్నారు. అయితే నాలుకకు అలవాటైన రుచిని ఒక్కసారిగా వదిలేయడం కష్టమే అందుకే ఆరోగ్యాన్ని కాపాడే ప్రత్యామ్నాయ మార్గాలు అవసరంగా మారాయి.

**చక్కెర... తీయని విషం:** మన రోజువారీ జీవితంలో చక్కెర భాగమైపోయింది. టీ, కాఫీ నుంచి స్వీట్స్ వరకూ చక్కెర లేనిదే కుదరదు. కాని ఇందులో ఎటువంటి పోషకాలు లేవు. అధికంగా తీసుకుంటే రక్తంలో ఇన్సులిన్ స్థాయిలుఅస్తవ్యస్తమౌతాయి. ఆ తర్వాత డయాబెటిస్ మాత్రమే కాకుండా కాలేయం చుట్టూ కొవ్వు పేరుకు పోయి లివర్, రక్త నాళాల్లో మంట, గుండెజబ్బులు వంటి సమస్యలు తలెత్తుతాయి.

**ప్రత్యామ్నాయాలు ఇవే..:** స్టీవీయా (మధుపత్రి) మొక్కల నుంచి తీసిన సహజ స్వీటనరీ చక్కెరకు గట్టి ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చింది. ఇందులో క్యాలరీలు సున్నా, రక్తంలో చక్కెర స్థాయిలు పెంచదు. ' షుగర్ ఫ్రీ గ్రీన్' వంటి ఉత్పత్తులు సురక్షిత మార్గంగా పరిగణిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో లభిస్తాయి. టీ లేదా కాఫీలో చిటికెడు వేస్తే సహజ తీపి సువాసన ఇస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణకుతోడ్పడుతుంది.

**ఉప్పుతో ముప్పులెన్నో..:** మన వంటకాలో ఉప్పు తప్పనిసరి.. సాధారణంగా ఉప్పులో సోడియం అధికంగా ఉండడం వల్ల శరీరంలో నీటి శాతం పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది. బీపీ 150-160 దాటితే ప్రమాదకరం. దీనివల్ల పక్షవాతం, కిడ్నీలు దెబ్బతినడం, గుండెపోటు వంటి సమస్యలకు ప్రధాన కారణం. లిలో-సోడియం సాల్ట్ (ఓ-సాల్ట్): సోడియంతక్కువగా, పొటాషియం ఎక్కువగా దీంట్లో ఉండడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అయితే కిడ్నీ సమస్యలు వున్నవారు లేదా కొన్ని బీపీ మందులు వాడే వారు లో-సోడియం సాల్ట్ వాడే ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. అలాగే వేయించిన వెల్లుల్లి పొడిని ఉప్పుకి బదులుగా వాడుకోవచ్చు. కూర చివరలో నిమ్మరసం కలిపితే రుచికి లోటుండదు. జీలకర్ర, ధనియాల పొడి, వేయించిన జీలకర్ర పొడి ఉప్పుకు సమానమైన రుచిని ఇస్తుంది.

**తెల్ల బియ్యం...:** పాలిస్ పెరిగే కొద్దీ తెల్లబియ్యంలో మనకు మేలు చేసే ' తౌడు' పీచు ( ఫైబర్) పూర్తిగా నశించి పోతాయి. మిగిలేది కేవలం పిండి పదార్థమే. ఇవి తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరుగుతాయి. దీనివల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోయి బొజ్జ పెరగడానికి, స్థూలకాయానికి దారితీస్తుంది.

**బ్రౌన్ రైస్/ దంపుడుబియ్యం.. :**ఇందులో పీచు అధికంగా ఉండి చక్కెర నిదానంగా రక్తంలో చేరుతుంది. బీపీ, షుగర్ నియంత్రణకు సహాయ పడుతుంది. విటమిన్ బీ-1, బీ-3, బీ-6, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి.

నూనెతో రోగాలు ఎన్నో: మనం సాధారణంగా వాడే సన్‌ఫ్లవర్, సోయా, పామాయిల్ ఎక్కువగా ప్రాసెస్ అయినవే. ఎక్కువగా వాడితే గుండెజబ్బులు, ఇన్‌ఫ్లామేషన్ ప్రమాదం వుంది. ఒకే నూనెను మళ్లీ, మళ్లీ వేడిచేస్తే విష పదార్థాలు ఏర్పడి క్యాన్సర్, గుండె జబ్బులకు కారణమౌతుంది. వీటికి "ప్రత్యామ్నాయాలు ఇవే"గానుగ నూనెలైన నువ్వుల నూనె, ఆవాలు నూనె, వేరుశెనగ నూనె తదితర సాంప్రదాయ నూనెలు కూరలు, వేపుళ్లకు మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నూనెల్లో సహజ విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తూ జీర్ణక్రియకు సాయపడతాయి. రిఫైండ్ నూనెతో పోల్చితే హానికర పదార్థాలు తక్కువని వైద్యులు చెబుతున్నారు.

"అలవాట్లే అసలు మార్పు": కేవలం ఆహారపదార్థాలు మార్చితే సరిపోదు. మన రుచుల అలవాట్లను మార్చుకోవాలి. తక్కువ పరిమాణంలో ఉప్పు, తీపి, నూనె కలిగిన ఆహారానికి నాలుక అలవాటు పడడానికి కనీసం 2 లేదా 3 నెలలు పడుతుంది. ఒకసారి ఆ మార్పు వచ్చాక సహజ రుచులే అమృతంలా అన్పిస్తాయి. అంతేకాక బీపీ, మధుమేహం వంటి వ్యాధులు నియంత్రణలోకి వస్తాయి. ఇప్పటి వరకూ ఎలాంటి సమస్యలు లేనివారిలో ఈ రోగాలు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ ఆహారాలను అలవాటు చేసుకోవాలి కేవలం నాలుక రుచికోసం చక్కెర, ఉప్పు, తెల్లబియ్యం, అధిక నూనెల వినియోగానికి అలవాటు పడి శరీరాన్ని లోలోపలే జబ్బులతో గుల్ల చేసుకోవడం కంటే వాటి స్థానంలో సురక్షితమైన ప్రత్యామ్నాయాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలి. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని అనుసరించి ముందుగా వైద్య నిపుణుల సూచనలతోనే మార్పులు ప్రారంభించాలి. ముఖ్యంగా లో-సోడియం ఉప్పు లేదా నూనెల వినియోగంలో జాగ్రత్తలు వహించండి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి.



శ్రీదేవి మాదాసి (ఉపాధ్యాయురాలు)
( హనుమ కొండ)

# చురుగ్గా భారాస సభ ఏర్పాట్లు



జగిత్యాల: ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా కేంద్రమైన జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో ఈనెల 20న నిర్వహించే భారాస బహిరంగ సభ ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. లక్ష మందితో నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ని పార్టీలోకి ఆహ్వానించేందుకు కూడా ఈ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిసిందే. అంతేకాకుండా బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గళమెత్తనున్న సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అ పార్టీ అధిష్టానం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలో నియోజకవర్గాల వారీగా నియమించిన ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో చురుగ్గా సాగుతున్నాయి. అయితే ఈ బహిరంగ సభకు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, భారస పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల రమణ తోపాటు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మార్క్‌ఫెడ్ లోక బాపు రెడ్డి తోపాటు అధిష్టానం నియమించిన నియోజకవర్గ ఇంచార్జ్ ల ఆధ్వర్యంలో లక్ష జనాలను తరలించేందుకు జన సమీకరణలో నిమగ్నమయ్యారు.

# కనిపించకుండానే నిర్మానుష్యం



హైదరాబాద్, ఏప్రిల్ 17, : భానుడి ప్రతాపంతో పగటి వేళ వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే పగటి వేళ రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొని ఉంది. గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవ్వడమే కాకుండా సెగగాలుల తీవ్రతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి ఎండల తీవ్రత మొదలవుతుంది. సాయంత్రం ఐదు గంటల వరకూ ఎండల తీవ్రత తగ్గడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు కూడా వీస్తుండటంతో బయటకు రావాలంటేనే భయమేస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు అన్ని చోట్ల నలభై రెండు నుంచి నలభై నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పల్నాడు, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. దాదాపు రాష్ట్రంలోని సగం మండలాల్లో వడగాలులు వీస్తున్నాయని, ఉత్తర కోస్తా ప్రాంతంలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారుతెలంగాణలో నేడు, రేపు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజు కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరికొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. 262 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందన్నారు. తెలంగాణలో క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. పలు జిల్లాల్లో ఎండల ధాటికి ఇళ్లకే ప్రజలు పరిమితం అవుతున్నారు. ఆదిలాబాద్‌లో 43.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 42.6 డిగ్రీలు, మిగిలిన అన్ని జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలో ఎండలు, వడగాలులు మరింత ప్రభావం చూపనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు కోస్తా, రాయలసీమలో 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. 46 మండలాల్లో తీవ్ర వడగాలులు, 73 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఎండ తీవ్రత, ఉక్కపోతపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు సూచిస్తున్నారు.

# పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..



విజయవాడ, : తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీ ఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాత రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆ తరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మల రామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు. సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనా మూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే. అది వారికి అలవాటైన విద్య కూడా. కానీ టిడిపి మాత్రం అలాంటి విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడమే. అదేపనిగా దానిని లాగి బయటకు ప్రచారం చేయడం ఉండదు. కానీ ఫస్ట్ టైం టిడిపి మంత్రులు అటాక్ చేయడం ప్రారంభించారు. తండ్రి అధికారం కోసం జగన్మోహన్ రెడ్డి ఎంత ఆరాటపడ్డారు.. ప్రస్తుతం వైసీపీలో ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పై ఏవిధంగా మాట్లాడారు అన్న విషయాలను గుర్తు చేస్తూ అచ్చెనాయుడు చేసిన కామెంట్స్ ఏపీ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. తరువాత అదే స్థాయిలో మాట్లాడారు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత. చివరకు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా హత్య గురించి ప్రస్తావిస్తూ వైసిపి పై విమర్శలు చేశారు. అయితే ఈ మొత్తం పరిణామాలతో మావిగన్ రాజధాని ప్రతిపాదన హైలెట్ అయింది. దానికి వ్యతిరేక ప్రచారం తోడైంది. వాస్తవానికి మావిగన్ పై వచ్చిన వ్యతిరేకతను.. అనుకూలంగా మార్చుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. మూడు నెలల పాటు దానికి టార్గెట్ పెట్టుకుంది. అదే పనిగా మావిగన్ ప్రచారం చేస్తే ప్రజల్లో క్రమేపి సానుకూలత వస్తుందని అంచనా వేసింది. కానీ ఈ విషయాన్ని గుర్తించిన టిడిపి మంత్రుల ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. అలా ఆ కౌంటర్ పతాక స్థాయికి తీసుకెళ్లింది. మావిగన్ పై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామనుకున్న వైసీపీ ఆశలను గండి కొట్టింది. పక్కా వ్యూహంతోనే టిడిపి మంత్రుల కౌంటర్ అటాక్ అని అర్థమైంది.

# పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి

**బుగ్గారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**
**నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనుల పరిశీలన**



జగిత్యాల: ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా బుగ్గారం మండలం యశ్వంత్రావుపేట్ గ్రామాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బుగ్గారం మండలంలోని యశ్వంత్రావుపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణ స్థితిని పరిశీలించి తగు సూచనలు అందించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం బుగ్గారం మండల కేంద్రంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, సమయపాలన పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, మహిళా సంఘ భవన నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అధికారులు నిర్మాణంలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం తప్పనిసరి అని అన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డి ఆర్ డి ఓ రఘువరన్, పిడి హౌసింగ్ ప్రసాద్, పంచాయతీ రాజ్ డీఈ గోపాల్, తహశీల్దార్ భూమేశ్వర్, యంపీడీఓ వాసవి, స్థానిక సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, ఏప్రిల్:17(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశిత గడువుల్లోనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలు లేకుండా తగినన్ని గన్నీ సంచులు, తూకపు యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని సామాగ్రి సమగ్రంగా ఉందో లేదో పరిశీలించి, పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తు తనిఖీలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నిబంధనలకు అనుగుణంగా రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు మహేష్, మిలర్స్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ఎస్టిపి ఏర్పాటు : ఎమ్మెల్యే జిఎంఆర్

**నేడు ప్లాంట్ ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో అవగాహనా సదస్సు**

పటాన్ చెరు, ఏప్రిల్ 17, (తెలంగాణ వాణి రిపోర్టర్) ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే అమీన్పూర్ పరిధిలో ఎస్టిపి (సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నంబర్ పరిధిలోని 10 ఎకరాలలో ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. అయితే ప్లాంట్ ఏర్పాటు మూలంగా తమకు దుర్వాసన, అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని సమీప కాలనీల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. నేడు ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలంలోనే.. సంబంధిత శాఖల అధికారులు, కాలనీల ప్రజలతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమకున్న సందేహాలను అధికారులతో కలిసి నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా అవసరమైన పక్షంలో హైదరాబాదులో ఏర్పాటు చేసిన ఎస్టీపి ప్లాంట్లను సైతం చూపించబోతున్నట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తమ తొలి ప్రాధాన్యత అని తెలిపారు. సమావేశానికి కాలనీల ప్రజలందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# డిజిటల్ ఎకో చాంబర్ విశ్వాసం, నమ్మకాలు మరియు భావోద్వేగాల పరీక్ష

డిజిటల్ సాక్షరత పెరుగుతున్న కొద్దీ, కృత్రిమ మేధస్సు పనితీరు మెరుగుపడుతున్న కొద్దీ, అల్గోరిథమ్‌ల వినియోగ పరిధి విస్తరిస్తున్న కొద్దీ – మన ప్రపంచం కూడా అదే వేగంతో ఒక డిజిటల్ ఎకో చాంబర్‌గా మారుతోంది. మీ స్మార్ట్‌ఫోన్‌పై ఒక వేళ్ల క్లిక్‌తోనే ఒక నిర్దిష్ట రకం సమాచార దాడికి తలుపులు తెరుచుకుంటాయి. మీరు ఏదైనా వార్తను లేదా ప్రకటనను క్షణకాలం చూసినా సరే, మీరు ఇక సురక్షితులు కారు; అలాంటి సమాచారమే మిమ్మల్ని వెంటాడడం ప్రారంభిస్తుంది. దీనినే డిజిటల్ రెజనెన్స్ అంటారు. ఇది ఒక ఆన్‌లైన్ ఎకో చాంబర్‌ను సృష్టిస్తుంది, అందులో వ్యక్తి తన అభిప్రాయాలకు దగ్గరగా ఉన్న ఆలోచనలు, అభిప్రాయాలు, సమాచారమే మళ్లీ మళ్లీ చూస్తూ, వింటూ ఉంటాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన Facebook, X, Instagram, YouTube వంటి వేదికల అల్గోరిథమ్‌లు మీ లైక్స్, షేర్స్, సెర్చ్ హిస్టరీని పరిశీలించి అదే రకం విషయాలను పదేపదే చూపిస్తాయి. ఫలితంగా మీ చుట్టూ ఒక కంచె వేసినట్లవుతుంది; భిన్నమైన సమాచారం, విభిన్న అభిప్రాయాలు, వ్యతిరేక దృక్కోణాలు మీ వద్దకు చేరవు. దీని ఫలితంగా మీరు ఒక “డిజిటల్ గది”లో బంధించబడతారు, అక్కడ అందరూ మీలాగే ఆలోచిస్తున్నట్టు అనిపిస్తుంది. డిజిటల్ కమ్యూనికేషన్ ఒక అలాంటి వాతావరణాన్ని సృష్టించింది, అందులో సమాచారం సంప్రదాయ ప్రమాణాలైన పాండిత్యం, శాస్త్రీయ పరిశోధన, అధికారిక ధృవీకరణల ఆధారంగా పరీక్షించబడడం లేదు. దాని బదులు, ప్రజలు అల్గోరిథమ్ ఆధారిత వేదికల ద్వారా సిద్ధాంతాలను స్వీకరిస్తున్నారు, వాటి ఆధారంగా తమ ప్రపంచ దృక్కోణాన్ని నిర్మిస్తున్నారు. ఇవి తార్కిక విచారణకు బదులుగా భావోద్వేగ ప్రతిస్పందనలను అందిస్తున్నాయి. దీని ఫలితంగా “అటెన్షన్ ఎకానమీ” ఏర్పడింది. దుఃఖం, కోపం, భయం, సంచలనాత్మకత ఎక్కువగా ప్రజలను ఆకర్షిస్తాయి కాబట్టి అవే లాభదాయక వస్తువులుగా మారాయి. ఈ ప్రభావంతో డిజిటల్ మీడియా ఒక నైతిక పోరాట రంగంగా, యుద్ధభూమిగా మారింది. మతపరమైన గుర్తింపు, వర్గీయ నిబద్ధతలు, భావోద్వేగ కథనాలు రాజకీయ, సిద్ధాంత, వాణిజ్య ప్రయోజనాల కోసం ఆయుధాలుగా ఉపయోగించబడుతున్నాయి.

ఇలాంటి పరిస్థితినే ఖురాన్ “ఫిత్నా” అని పిలుస్తుంది.– అంటే సత్యం, అసత్యం కలిసిపోయే, సామాజిక స్థిరత్వాన్ని దెబ్బతీసే, మానవ నైతికతను పరీక్షించే ఒక క్లిష్ట పరిస్థితి.

దురదృష్టవశాత్తు, ఇతరులతో పాటు మన ప్రజలు, ముఖ్యంగా యువత కూడా ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. సమాజాన్ని ఈ పరిస్థితుల నుంచి బయటకు తేవాల్సినవారే తెలిసో తెలియకో ద్వేషం, శత్రుత్వం, భయం, హింస, పక్షపాతం వంటి వార్తల్లో నిమగ్నమవుతున్నారు. ఈ విధంగా డిజిటల్ ఎకో చాంబర్ వారిని కూడా ఖైదీలుగా మార్చింది.

మన యువత ఇస్లాం గురించి తెలుసుకోవడానికి కూడా డిజిటల్ మీడియాపైనే ఆధారపడుతోంది. అసలైన ఆధార గ్రంథాల బదులుగా ప్రసిద్ధ వాదకుల నుంచి మతాన్ని నేర్చుకోవడం ప్రారంభించారు. వారిలో చాలామంది భావోద్వేగాలను అమ్ముతూ, మత గ్రంథాలను సందర్భం లేకుండా చూపిస్తున్నారు. ఏదైనా ముస్లిం మరొక మత గ్రంథం నుంచి ఉదాహరణ చెప్పినా, లేదా ఏదైనా ముస్లిమేతరుడు ఇస్లాం లేదా ముస్లింను ప్రశంసించినా, అలాంటి వ్యాఖ్యలు లక్షల వ్యూస్ పొందుతున్నాయి.

ఈ భావోద్వేగ దోపిడీ మనసులను, స్వభావాన్ని ఎలా ప్రభావితం చేస్తోందో వివేకం ఉన్న ఎవరూ నిర్లక్ష్యం చేయలేరు. కానీ ప్రశ్న ఏమిటంటే దీనికి పరిష్కారం ఏమిటి? దీన్ని ఎలా నియంత్రించాలి? దాని నుంచి బయటపడే మార్గం ఏమిటి?

ప్రతి ముస్లింకు తెలిసిన విషయమే – పవిత్ర ఖురాన్ మార్గదర్శకం కేవలం ఆరాధనకే పరిమితం కాదు. జీవితం యొక్క ప్రతి రంగంలో ఇస్లాం మార్గనిర్దేశం చేస్తుంది. ప్రత్యేకంగా సూరహ్ అల్–హుజురాత్ సామాజిక సంబంధాలు, వివాద పరిష్కారం, మానవ గౌరవ పరిరక్షణకు ఒక నైతిక నియమావళిని అందిస్తుంది. ఇది ఆధునిక డిజిటల్ సంస్కృతిలోని నైతిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి, ఎదుర్కోవడానికి ఒక చట్రంగా ఉపయోగపడుతుంది. ఇస్లాం మనసును ఒక గూటిలో బంధించడం, బుద్ధిపై తాళాలు వేయడం, చైతన్యాన్ని మూసివేయడం వంటి వాటికి పూర్తిగా వ్యతిరేకం. ఇస్లాం ఆవిర్భవించినప్పుడు మొదటగా బుద్ధి, చైతన్యం, ఆలోచనలకు ఆహ్వానం ఇచ్చింది.

ఇస్లాం యొక్క ప్రాథమిక సందేశం “తౌహీద్” – అంటే సమస్త మానవజాతి ఒకే తల్లిదండ్రుల సంతానం, ఒకే దేవుని సేవకులు. సృష్టికర్త, పోషకుడు ఒక్కరే; అందరికీ ఒకే న్యాయం, సమాన హక్కులు. ఖురాన్ పదేపదే మానవుడిని విశ్వసృష్టిని పరిశీలించమని, ప్రకృతి వైచిత్ర్యాలపై ఆలోచించమని, బుద్ధిని వినియోగించమని, చీకటి నుంచి వెలుగులోకి రావమని పిలుస్తుంది. అలాగే మతంలో బలవంతం లేదని, మార్గదర్శకత్వం మరియు తప్పుదారి రెండూ స్పష్టంగా చూపబడ్డాయని చెబుతుంది. డిజిటల్ మీడియా సమాచార మార్పిడిని వేగవంతమైన సరిహద్దులేని నెట్‌వర్క్‌గా మార్చింది. ఇది జ్ఞాన వనరులకు అందరికీ అపూర్వ ప్రాప్తిని కల్పించింది. అయితే అదే సమయంలో కొత్త రకాల సామాజిక ఘర్షణలు, తప్పుడు సమాచారం, భావోద్వేగ చిక్కులు, సిద్ధాంత పరమైన విభజనలను కూడా సృష్టించింది.

ఈ “ఫిత్నా” యొక్క రూపాలు ఇవి:

1. తప్పుడు మరియు తప్పుదారి పట్టించే సమాచారం
2. అల్గోరిథమ్ ఎకో చాంబర్లు
3. మతపరమైన గుర్తింపుల భావోద్వేగ దోపిడీ
4. బహిరంగ అవమానం మరియు వ్యక్తిత్వ హత్య
5. విభజన, వర్గీయ ద్వేషం
6. అనుమానం మరియు కుట్ర భావజాలం వ్యాప్తి

అందువల్ల ఈ ఫిత్నా కేవలం సాంకేతిక సమస్య కాదు; ఇది నైతిక, ఆధ్యాత్మిక సవాలు కూడా. ఇది వ్యక్తుల మనస్సాక్షిని మలుస్తుంది, సామాజిక ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది, వర్గాల మధ్య విశ్వాసాన్ని చెరిపేస్తుంది. ఇస్లామీయ దృక్కోణంలో ఎకో చాంబర్లు మేధో అవినీతిలో అత్యంత చెడ్డ రూపాల్లో ఒకటి. ఇవి విమర్శనాత్మక ఆలోచనను అణచివేసి, అహంకారం, ద్వేషం, భావోద్వేగ ఆధారిత ఆలోచనను ప్రోత్సహిస్తాయి.

మీడియా కోసం ఖురాన్ నైతిక సూత్రాలు:

1. సమాచారం ధృవీకరణ -- “ఒక దుష్టుడు మీ వద్దకు వార్త తెస్తే దాన్ని పరిశీలించండి...” (ఖురాన్ 49:6)
2. సామాజిక ఘర్షణల్లో శాంతి స్థాపన -- “రెండు విశ్వాసుల గుంపులు పోరాడితే వారిని కలపండి.” (49:9)
3. ఎగతాళి మరియు అవమానం నిషేధం -- “ఒక జాతి మరొక జాతిని ఎగతాళి చేయవద్దు...” (49:11)
4. అనుమానం మరియు కుట్రల నివారణ -- “అత్యధిక అనుమానాన్ని నివారించండి...” (49:12)
5. గోప్యత రక్షణ -- “గూఢచర్యం చేయవద్దు.” (49:12)
6. వెనక మాట్లాడటం నిషేధం -- “ఒకరి వెనుక ఒకరు దూషించవద్దు...” (49:12)

డిజిటల్ ఫిత్నా యొక్క ప్రధాన లక్షణం మతం మరియు విశ్వాసాల దుర్వినియోగం. భయం, కోపం, గర్వం వంటిభావోద్వేగాలను రెచ్చగొట్టి మతపరమైన గుర్తింపును ప్రజలను కదిలించడానికి ఉపయోగిస్తున్నారు. ఫలితంగా మతం నైతిక సంస్కరణకు బదులుగా సిద్ధాంత యుద్ధానికి సాధనంగా మారుతోంది. డిజిటల్ మీడియా ఒక కొత్త ఫిత్నా ప్రాంతాన్ని సృష్టించింది, అందులో అసత్యం సత్యం కంటే వేగంగా వ్యాపిస్తుంది, భావోద్వేగ మాయాజాలం ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఈ ఫిత్నాను ఎదుర్కోవడం కేవలం సాంకేతిక సవాలు కాదు; ఇది మతపరమైన మరియు నైతిక బాధ్యత కూడా.

## మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి) ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనం అమలు తీరును ఎల్లారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎల్ రాజులు తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయులు కే లింగమూర్తి సార్ పాల్గొనడం జరిగింది.

## ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

### టీజీఈజెఏసి జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన



జగిత్యాల: ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి): టిజిఈజెఏసి రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఈ రోజు టిజిఈజెఏసి జగిత్యాల జిల్లా పక్షాన జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, క్లాస్ ఫోర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు పాల్గొని జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ సమస్యలన్ని పరిష్కరించాలని కోరారు. అనంతరం టిజిఈజెఏసి జగిత్యాల పక్షాన అదనపు కలెక్టర్ బిఎస్.లత ద్వారా జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

## రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ ఫెలోగా కేయూ ప్రొ. మామిడాల ఇస్తారి ఎంపిక



హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ (తెలంగాణ వాణి) కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి అంతర్జాతీయ స్థాయిలో మరొక ప్రతిష్టాత్మక గుర్తింపును సాధించారు. యునైటెడ్ కింగ్డమ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రీయ సంస్థ రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ కౌన్సిల్ తీర్మానం మేరకు ప్రో. మామిడాల ఇస్తారి నీ “ఫెలో”గా ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన అధికారిక ఈమెయిల్ నిన్న రాత్రి అందిందనీ తెలిపారు. డా. ఇస్తారి ఇప్పటికే డీబీటీ (భారత ప్రభుత్వం) నుండి రాపిడ్ గ్రాంట్ యంగ్ ఇన్వెస్టిగేటర్ అవార్డు, అమెరికాలోని ఆసియో నుండి అమెరికన్ రేడియో లేబుల్డ్ యంగ్ సైంటిస్ట్ అవార్డు, యూజీసీ రామన్ పోస్ట్–డాక్టోరల్ ఫెలోషిప్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. ఆయన ఇప్పటివరకు డీ.ఎస్.టీ, డీ.బీ.టీ, యూజీసీ, ఐ.సీ.ఎం.ఆర్, రూసా సంస్థల మద్దతుతో 10 పరిశోధన ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించారు. 100కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు 22 పుస్తకాలను రచించారు. అదనంగా 10 పేటెంట్లు (9 భారతదేశం, 1 అమెరికా) సాధించారు. 13 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ఆయన చైనా, అమెరికా, స్పెయిన్, సింగపూర్, మలేషియా వంటి దేశాలకు శాస్త్రీయ పర్యటనలు చేశారు. ఈ సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ ప్రో ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రో రామచంద్రం, ఓ.ఎస్.డీ ప్రో. వెంకట్రాం రెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రో. మనోహర్, జూవాలజీ విభాగ అధిపతి ప్రో. వెంకయ్య, షమిత, నారాయణ ఇతర కేయూ ప్రొఫెసర్లు ప్రో ఇస్తారీని అభినందించారు.

## సీఎం పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





జయశంకర్ భూపాలపల్లి.: (తెలంగాణ వాణి) ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ కాళేశ్వరం, అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు కేటాయించిన విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నస్తూర్ పల్లి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభా స్థలి వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని డీపీవోకు సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. చేపట్టనున్న పనులను పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ కు సూచించారు. హెలి ప్యాడ్, అప్రోచ్ రోడ్డు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అలాగే పబ్లిక్ మీటింగ్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు అంబులెన్సులు సేఫ్ హౌస్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాళేశ్వర దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయాలని ఈఓను ఆదేశించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి కేటాయించిన విధులపై ధ్రువీకరణ నివేదిక అందజేయాలని తెలిపారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇసుక లారీలకు అనుమతి ఇవ్వొద్దని, మూసివేయాలని ఆయన తెలిపారు. విధులు నిర్వహించు సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవో కు సూచించారు. అంతకుముందు కాలేశ్వరం నస్తూరి పల్లిలో సీఎం పర్యటన హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనానికి పోలీసు అధికారులను ఆహ్వానించిన కమిటీ



కొత్తగూడెం (తెలంగాణ వాణి) కొత్తగూడెం పట్టణంలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న “హిందూ సమ్మేళనం” కార్యక్రమానికి సంబంధించి, సమ్మేళన కార్యక్రమానికి సంబంధించి కమిటీ సభ్యులు కార్యాచరణను మరింత వేగవంతం చేస్తున్నారు. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు కొత్తగూడెం డిఎస్పి ని మర్యాద పూర్వకంగా కలిసి, సమ్మేళనం కార్యక్రమానికి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమం లక్ష్యాలు, ఏర్పాట్లు, ప్రజల పాల్గొనే విషయంపై వివరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతు హిందూ సమాజంలో ఐక్యత, ధర్మ పరిరక్షణ, సాంప్రదాయ విలువల పరిరక్షణ లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించబడుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్పి కార్యక్రమం గురించి తెలుసుకుని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది.

ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, అలాగే సభ్యులు యెలదండి పూర్ణచందర్ రావు, వెంకట్ రెడ్డి, రాజేశ్వరరావు, న్యాయవాది పాతూరి పాండురంగ విటల్ పాల్గొన్నారు. సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ పిలుపునిచ్చింది.

## ప్రతిభా ప్రదర్శన వేదికగా ‘సాధన–2026’



పటాన్ చెరు, ఏప్రిల్ 17, (తెలంగాణ వాణి రిపోర్టర్): లలిత, ప్రదర్శన కళల విభాగం విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే ‘సాధన–2026’ను శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం డ్యాన్స్ స్టూడియోలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమాని టీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపకులు కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, థియేటర్, లలిత కళల లోని మైనర్, ఓపెన్ ఎలెక్టివ్ కోర్సులలో చేరిన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. సెమిస్టర్ చివరి ప్రాక్టికల్ పరీక్షలలో భాగంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని, కళాత్మక ఎదుగుదలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూచిపూడి, భరతనాట్యం, థియేటర్ ఆర్ట్స్ విభాగాల నుంచి పాల్గొన్నవారు తమ అకడమిక్ మూల్యాంకనంలో భాగంగా అద్భుతమైన వేదిక ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి విభాగానికి డాక్టర్ వై. లలిత సింధూరి, వైష్ణవి ప్రతివాది మార్గదర్శకత్వం వహించగా, భరతనాట్యం ప్రదర్శనలకు అంజు అరవింద్ మార్గదర్శకత్వం వహించారు. నాటక కళల ప్రదర్శనలకు డాక్టర్ శ్యామ్ ప్రకాష్ నాయకత్వం వహించగా, కర్ణాటక సంగీత విద్యార్థులకు మృదురవళి దర్భ మార్గదర్శకత్వంలో శిక్షణ ఇచ్చారు. మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్ పై వాసు అందించిన ప్రత్యక్ష సంగీత సహకారంతో ఈ ప్రదర్శనలు మరింత సుసంపన్నమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి ప్రదర్శన దాని కళాత్మక నైపుణ్యానికి, భావ గాఢతకు విస్తృత ప్రశంసలను అందుకుంది.

## ఆటలతో పిల్లల్లో మానసిక వికాసం

### సిడిపిఓ మమత

### మూడవ వార్డులో పోషణ్ పక్వాడ్



జగిత్యాల : ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి): పిల్లల్లో ఆటల ద్వారా మానసిక వికాసం పెంపందుతుందని జగిత్యాల ఐసీడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మమత అన్నారు. పోషణ పక్వాడ్ లో భాగంగా ఈ సి సి ఈ పై అవగాహన జగిత్యాల పట్టణం 3 వార్డులోని చిలుకవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం జరిగింది. చిలుకవాడ అంగన్వాడీ కేంద్రంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ రాగులు ప్రదీప్ అధ్యక్షతన జగిత్యాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మమత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సి డి పి ఓ మమత మాట్లాడుతూ ఎర్లీ చైల్డ్ వుడ్ కేర్ ఎడ్యుకేషన్ లో భాగంగా పిల్లలకు ఆట, పాటలతో కూడా విద్య ద్వారా పిల్లల శారీరక మార్పు జరుతుందన్నారు. చిన్నప్పటినుండే మంచి అలవాట్లు నేర్పించడం, ఆటల ద్వారా పిల్లలు చిన్న కండరాలు, పెద్ద కాండరాల అభివృద్ధి జరుగుతుందని సీడిపిఓ వివరించారు. ఆటల ద్వారా పిల్లలలో మానసిక వికాసం జరుగుతుందని మమత వివరించారు. అభివృద్ధి మైలు రాళ్లు బిడ్డ పుట్టినప్పటి నుండి ప్రతి నెల బిడ్డా శారీరకంగా నెల నెల బిడ్డ పాకడం నుండి తనకు తాను నిల్చొని నడిచే వరకు ఎలా అభివృద్ధి జరుగుతుంది, గుర్తించడం లోపాలను తొందరగా గుర్తించి దానికి తగిన విధంగా ట్రీట్మెంట్ ఇప్పించడం గురించి తల్లిదండ్రులు అవగాహనా కల్పించారు. గర్భిణీ, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికహారం గురించి వివరించారు. వార్డు కౌన్సిలర్ ప్రదీప్ మాట్లాడుతూ పిల్లల కి మొబైల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలని, తల్లులు, పిల్లలు సరైన సమాతుల ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీ సేవలు అందరూ వినియోగించుకొని, పిల్లలను అంగన్వాడీ సెంటర్ కి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కవితరాణి, అంగన్వాడీ టీచర్ పవిత్ర, జ్యోతి, ఏఎన్ఎం మాదేషి శిరీష ఆయా, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.




# మృణాల్‌తో సినిమా అంటే హీరోలు జాగ్రత్తగా ఉండాల్సిందే!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌తో సినిమాలు చేసే హీరోలు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, సెంటిమెంట్ అలా నడుస్తుంది.ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ పేరు ఇండస్ట్రీ వర్గాల్లో ఎలా వినిపిస్తుందో తెలిసిందే. రీసెంట్‌గా ధనుష్ తో పెళ్లి అంటూ ఆమెపై వార్తలు వచ్చాయి. ఆ వార్తలకి ఎలాగోలా స్టాప్ పెట్టిన మృణాల్.. ఇప్పుడు తన సినిమాలతో చర్చల్లో నిలుస్తున్నారు. అడివి శేష్ సరసన హీరోయిన్‌గా నటించిన 'డెకాయిట్' చిత్రం థియేటర్లలో విడుదలై.. సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సినిమా ప్రమోషన్స్‌లో మృణాల్ యమా యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. అలా ఓ ఈవెంట్‌లో తెలుగు హీరోనే పెళ్లి చేసుకుంటుందని, మృణాల్‌పై అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో తెలుగు ప్రేక్షకులు ఆమెపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెడుతున్నారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్‌కు ఈ అందాల భామ సెలక్ట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమాల్లోని ఒక వింత సెంటిమెంట్ గురించి ఈ భామ బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తన స్నేహితులు తనను సరదాగా 'హస్బెండ్ మర్డరర్' (భర్తలను చంపేసే భార్య) అని ఆటపట్టిస్తుంటారని నవ్వుతూ చెప్పింది. అందుకు కారణం ఆమె నటించిన వరుస సినిమాలు, అందులో హీరోల పాత్రల ముగింపేనని అంటోంది. ఆ వివరాల్లోకి వెళితే.. హిందీ 'జెర్సీ' సినిమాలో షాహిద్ కపూర్ పాత్ర చివరికి చనిపోతుంది. 'సీతారామం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీలో కూడా దుల్కర్ సల్మాన్ పాత్ర ప్రాణాలు విడుస్తుంది. అలాగే 'ధమాకా'లో కార్తీక్ ఆర్యన్ పాత్ర కూడా అంతే! ఇక తాజాగా విడుదలైన 'డెకాయిట్' సినిమాలో కూడా హీరో అడవి శేష్ పాత్రకు ఇదే గతి పట్టింది. "సీతారామంలో రామ్ చనిపోయారు.. ఇప్పుడు అడవి శేష్ పాత్ర కూడా అంతే! నా సినిమాల్లో హీరోలందరినీ ఇలా చంపేస్తున్నందుకు నా ఫ్రెండ్స్ నన్ను ఆటపట్టిస్తున్నారు" అంటూ మృణాల్ సరదాగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోకు నెటిజన్లు కూడా సరదాగా రియాక్ట్ అవుతున్నారు. మృణాల్‌తో కలిసి నటించే హీరోలు తమ పాత్రల విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకోవాలంటూ నెటిజన్లు చేసే కామెంట్స్‌తో ఈ వీడియో బాగా చక్కర్లు కొడుతోంది.

## నాన్న క్రమశిక్షణే నాకు స్ఫూర్తి..

# తండ్రిపై చరణ్ ఆసక్తికర కామెంట్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. మొదట ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకున్న ఈ మూవీని, ప్రేక్షకులకు మరింత మెరుగైన థియేట్రికల్ అనుభూతిని అందించేందుకు జూన్‌కు వాయిదా వేసారు.ఇక ఇదిలా ఉంటే, రామ్ చరణ్ మరో అంతర్జాతీయ గుర్తింపును అందుకున్నారు. ప్రతిష్టాత్మక 'ఈ స్క్వేర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై చోటు దక్కించుకున్న టాలీవుడ్ హీరోగా ఆయన ప్రత్యేక రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తిగత జీవితంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి ప్రభావం గురించి మాట్లాడుతూ, "నా జీవితంలో నిజమైన హీరో నాన్నే" అని గర్వంగా తెలిపారు. నాన్న వారసత్వాన్ని అందిపుచ్చుకోవడం తమకు సులభంగా అనిపించినప్పటికీ, ఆయన పడ్డ కష్టం మాత్రం అపారమని అన్నారు. సినిమాల కోసం చిరంజీవి పడే కష్టం గురించి చెబుతూ, షూటింగ్‌ల సమయంలో రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అంత బిజీ షెడ్యూల్‌లో కూడా కుటుంబానికి సమయం కేటాయించడంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదని వెల్లడించారు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా ఇంట్లో మాత్రం సాధారణ తండ్రిలా ఉండటం చిరంజీవి ప్రత్యేకత అని కొనియాడారు. కష్టాల్లో ఉన్న సినీ పరిశ్రమ వ్యక్తులకు అండగా నిలవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని చెప్పారు.

వృత్తిపరమైన బాధ్యతలు, కుటుంబ బంధాలను సమన్వయం చేసుకోవడం ఎలా అనేది తన తండ్రిని చూసే నేర్చుకున్నానని చరణ్ తెలిపారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగే చిరంజీవి తత్త్వం తనపై ఎంతో ప్రభావం చూపిందని, ప్రస్తుతం తాను కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నానని పేర్కొన్నారు. మూడు రోజులు విరామం దొరికినా కుటుంబంతో గడపడానికి ప్రాధాన్యత ఇచ్చే ఆయన క్రమశిక్షణ తనకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. రామ్ చరణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# బన్నీ 'రాకా'లో బాలీవుడ్ బాద్‌షా?




'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఓ కీలక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ కోసం ఆయన రోజూ 3 నుంచి 4 గంటల సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ విషయంలోనూ పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ముంబైలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నటీనటుల పూర్తి వివరాలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రకాష్ రాజ్ వ్యాఖ్యల వివాదం...

# రామాయణంపై చేసిన వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ఆగ్రహం



ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ఇటీవల రామాయణం, దేశంలోని సామాజిక పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించాయి.రాముడు, లక్ష్మణుడు ఉత్తర భారతం నుంచి వచ్చినవారని, దక్షిణాదిలో ఓ గిరిజనుడైన రావణుడి పొలంలోకి వెళ్లి పండ్లు తిన్నారని, ఆ విషయంపై వివాదం చెలరేగిందని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు రామాయణ గాథను వక్రీకరించేలా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.అదే విధంగా, ఒక మీడియా సమావేశంలో కూడా శ్రీరాముడు ఉత్తర భారతానికి చెందినవారని, రావణుడు దక్షిణ భారత తెగకు చెందినవాడని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. పురాణ గాథలను తప్పుగా చూపిస్తూ, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. మతపరమైన అంశాలపై బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని నెటిజన్లు సూచిస్తున్నారు. ఇక దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై కూడా ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత పెంచాయి. మైనారిటీలు, గిరిజనులు, ముస్లింలపై ప్రమాదం ఉందని ఆయన చేసిన ఆరోపణలు ఆధారరహితమని కొందరు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మతపరమైన మనోభావాలను కించపరిచినందుకు, సమాజంలో విద్వేషాలను ప్రేరేపించినందుకు గాను ఆయనపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికలపై ఆయనను అరెస్ట్ చేయాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తూ, రాజకీయ, సామాజిక వర్గాల్లో పెద్ద ఎత్తున స్పందన రాబడుతున్నాయి.

## కన్నవారికి కర్మలు చేయలేకపోయా...

# పాపం ప్రతాప్ హీరో ఎమోషనల్ కామెంట్స్ వైరల్



టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్ తాజాగా 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తన సహజమైన నటనతో తిరువీర్ మరోసారి ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తున్నాడు.అయితే ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తిరువీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక బాధాకర విషయాన్ని ఆయన అభిమానులతో పంచుకున్నారు. సినిమా షూటింగ్ షెడ్యూల్స్, లుక్ కంటిన్యూటీ సమస్యల కారణంగా తన తల్లిదండ్రుల అంత్యక్రియలు, అనంతర కర్మకాండలను సరిగ్గా నిర్వహించలేకపోయానని తిరువీర్ భావోద్వేగంతో చెప్పారు.షూటింగ్ మధ్యలో జుట్టు కత్తిరించడం లేదా లుక్ మార్చడం సాధ్యం కాకపోవడంతో, వృత్తిపరమైన బాధ్యతల కోసం వ్యక్తిగతంగా పెద్ద త్యాగం చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ కారణంగా కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి విమర్శలు కూడా ఎదుర్కొన్నానని ఆయన వెల్లడించారు. ఒక్కడే కొడుకువై ఉండి కనీసం ఈ మాత్రం కూడా చేయలేవా? అని అడిగిన సందర్భాలు తనను మరింత బాధించాయని తెలిపారు. వృత్తి పట్ల ఉన్న అంకితభావం తనను వ్యక్తిగతంగా ఎంతగా కలిచివేసిందో చెబుతూ, ఆ గిల్ట్ జీవితాంతం తనను వెంటాడుతుందని తిరువీర్ పేర్కొన్నారు. బయటకు నటుడిగా నవ్వుతూ కనిపించినా, లోపల ఎన్నోబాధలు, త్యాగాలు ఉంటాయని ఆయన మాటలు స్పష్టం చేశాయి. 'పాపం ప్రతాప్' సినిమా విజయవంతం కావాలని ఆశిస్తూ, తన కష్టానికి తగిన గుర్తింపు రావాలని అభిమానులు కోరు కుంటున్నారు. ప్రస్తుతం తిరువీర్ చేసిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, పలువురిని కదిలిస్తున్నాయి.

# 16 ఏళ్ల న్యాయపోరాటం.. నటి తమన్నాకు మద్రాస్ హైకోర్టులో భారీ షాక్!



మద్రాస్ హైకోర్టులో ప్రముఖ నటి తమన్నా భాటియాకు భారీ షాక్ తగిలింది. సుమారు 16 ఏళ్లుగా సాగుతున్న సుదీర్ఘ న్యాయ పోరాటంలో చివరకు ఆమెకు చుక్కెదురైంది. గతంలో 'పవర్ సోప్స్' అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిన తమన్నా, తన ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ తన ఫోటోలను ప్రకటనల్లో వాడుకుందని ఆరోపిస్తూ 2011లో కోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా ఫోటోలు వాడినందుకు గాను కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆమె సివిల్ సూట్ దాఖలు చేశారు.

అయితే ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్, తమన్నా ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది. ఆమె సమర్పించిన సబ్బు కవర్లు, ఇతర పత్రాలు సదరు సంస్థ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనకు పాల్పడిందని నిరూపించలేకపోయాయని కోర్టు అభిప్రాయపడింది. గతంలోనే ఒక సింగిల్ జడ్జి ఆమె పిటిషన్‌ను కొట్టివేయగా, దానిని సవాలు చేస్తూ తమన్నా అప్పీల్‌కు వెళ్లారు. తాజాగా జస్టిస్ పి. వేల్మురుగన్, జస్టిస్ కె. గోవిందరాజన్ తిలకవతిలతో కూడిన ధర్మాసనం పాత తీర్పునే సమర్థిస్తూ ఆమె అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేసింది. ఈ తీర్పుతో నష్టపరిహారం రాకపోగా, ఇన్నేళ్లుగా సాగిన పోరాటం ఆమెకు నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# హైడ్రా.... డ్రామా..!



హైదరాబాద్, ఏప్రిల్ 17, : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్థ హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత కొద్ది రోజులుగా నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాల తొలగింపులో దూకుడు ప్రదర్శిస్తున్న హైడ్రాకు ఇది బిగ్ షాక్ అని వైరల్ అవుతోంది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కూల్చివేతలు నిలిపివేయాలనే హైకోర్టు స్పష్టం చేసినట్టు ప్రచారం సాగుతోంది. హైడ్రా పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా ఖండించింది. ఇదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆ నోటీసులు పూర్తిగా నకిలీవని స్పష్టం చేసింది. ఈ ఫేక్ ప్రచారంపై హైడ్రా తీవ్రంగా స్పందించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాని మండిపడింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుకు అధికారికంగా ఫిర్యాదు కూడా చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, న్యాయస్థానాల గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా కోరింది. హైడ్రా కార్యకలాపాలను పరిశీలించిన హైకోర్టు, ఈ సంస్థకు ఇప్పటి వరకు ఒక నిర్దిష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని తప్పుపట్టిందని సర్క్యులేట్ అవుతున్న డాక్యుమెంట్‌లో ఉంది. ఏడాది కాలం గడుస్తున్నా, నిబంధనలు రూపొందించకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందని నోటీసుల్లో పేర్కొన్నట్టు ఉంది. నోటీసులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ కాదని కూడా కోర్టు అభిప్రాయపడినట్టు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా అమీన్‌పూర్ పరి?లో జరిగిన కూల్చివేతలకు సంబంధించిన వీడియోను పరిశీలించిన తర్వాత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసిందని కూడా అందులో ఉంది. అయితే ఇవన్నీ కూడా హైడ్రాను దెబ్బతీసేందుకు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అధికారులు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సహజ వనరులను కాపాడటానికి హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చివేసేటప్పుడు కనీస గడువు ఇవ్వడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు కొందరి నుంచి వస్తున్న విమర్శలనే కోర్టు ఆదేశాలు అంటూ ప్రచారం చేస్తున్నారు. దీనిపై హైడ్రా ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు స్టార్ట్ చేశారు.

ఫాతిమా సంస్థల్లో చేరడంపై హైడ్రా కండిషన్స్: హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలంగాణ హైకోర్టు కీలక సూచన చేసింది. ఈ విద్యా సంస్థ నిర్మాణాల విషయమై పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, వారి పేరెంట్స్ తమ సొంత రిస్క్‌పైనే అడ్మిషన్లు తీసుకోవాలని స్పష్టం చేసింది. విద్యాసంస్థకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అప్పుడు ఎలాంటి హక్కులు కోరలేరని స్పష్టం చేసింది. కాబట్టి ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవితవ్యం కూడా తుది తీర్పుకు లోబడే ఉంటుందని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ విద్యా సంస్థను అక్రమంగా నిర్మించారని దీనిపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అడ్వకేట్ విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగరంలో 26 చెరువులుండగా.. కేవలం సల్కం చెరువుకు మాత్రమే ఎఫ్‌టీఎల్ ఖరారు చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ స్థాపించిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే.. ఈ సంస్థ చెరువు మధ్యలో, బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మేనేజ్‌మెంట్ తమ నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. దాంతో పాటు సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తదుపరి ఉత్తర్వులు ప్రభావం చూపుతాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఒవైసీ ఫాతిమా కాలేజీ సల్కం చెరువులో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నా.. దానిపై చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై సోషల్ మీడియా తదితర మాధ్యమల్లో హైడ్రాని పలువురు ప్రశ్నించారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గతంలోనే క్లారిటీ ఇచ్చారు. సల్కం చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మించిన ఫాతిమా కాలేజ్ తొలగిస్తామని గత సెప్టెంబర్‌లో ప్రకటించామని చెప్పారు. అయితే పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థ ఇక్కడ నడుస్తోందని అన్నారు. ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు వసూలు చేయరని.. 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ అయినందునే సామాజిక కోణంలో ఆలోచించి చర్యలు తీసుకోలేకపోతున్నామని చెప్పారు.

## జిల్లా న్యాయమూర్తి ప్రేమలతకు సింగరేణి అధికారుల శుభాకాంక్షలు



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి): కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమలత ని సింగరేణి కొత్తగూడెం ఏరియాకు చెందిన అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి కి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఆమె తన పదవీకాలంలో న్యాయ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిమ్ కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) సి. హెచ్. రామకృష్ణ. భూక్య తావుర్య నాయక్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి) ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన రాజిరెడ్డి (కేబుల్ టీవీ పనులు చేస్తూ జీవనం సాగించే వ్యక్తి) కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. పాత ఎయిర్ కూలర్‌ను మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రుద్రంపూర్‌లో రోడ్డు భద్రతపై..
# అవగాహన కార్యక్రమం





కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని ఆర్సిఓఏ క్లబ్‌లో శుక్రవారం పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎస్పీ ఎన్. ఆదినారాయణ, కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడి బాధ్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. జీఎం మాట్లాడుతు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం సమాజ అభివృద్ధికి అవసరమని, ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించిన పోలీస్ శాఖ అధికారులను ముఖ్య అతిథులు అభినందించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 2 టౌన్ సీఐ ప్రతాప్, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్ ,రుద్రంపూర్ సర్పంచ్ బానోత్ కేస్లీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆటో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు, అప్రెంటిస్‌లు కూడా ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేషనల్ హైవే-63 వద్ద భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ విచారణ

### ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. ఎస్ లత



జగిత్యాల: ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామ పరిధిలోని నేషనల్ హైవే-63 వద్ద భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బి.ఎస్ లత మాట్లాడుతూ ప్రత్యక్షంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత భూసమస్యలు, సరిహద్దులు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. స్థానిక రైతులు, భూ యజమానుల నుండి అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల సరిదిద్దడం, అవసరమైన ధృవపత్రాల జారీ, మరియు చట్టబద్ధమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పరిష్కరించి, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా సేవలు అందించడానికి చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరిశీలనలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకిమ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## పిఆర్ సి,ఇంక్రూమెంట్స్ పెండింగ్ బిల్లు చెల్లించాలని తహసిల్దార్ కి వినతి



కోహెడ (తెలంగాణ వాణి విలేకరి) రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని నెలల నుండి ఉద్యోగులకు పిఆర్సి ఇంక్రూమెంట్స్ పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని వాటి పైన తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు సిద్దిపేట జిల్లాకోహెడ మండల కేంద్రంలోని అన్నిప్రభుత్వ శాఖల ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీనాయకులుపాల్గొని కోహెడతాసిల్దార్ నవీన్ కుమార్ కు మెమొరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా ఉపాధ్యక్షులు బూడిద ఎల్లయ్య,ఎంపీడీఓ కృష్ణయ్య, సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిమ్రాతర్నుమ్, సీనియర్ సహాయకులు వివిధ శాఖల అధికారులు గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ప్రజలు నిత్యం సైబర్, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి**

**రహదారుల ప్రమాదాల నివారణకు అవగాహన కీలకం:కలెక్టర్ అంకిత్**





భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో "అర్రైవ్ అలైవ్" కార్యక్రమం కింద శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్,జిల్లా ఎస్పీ రోహిత్ రాజుముఖ్య అతిథులుగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్వత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిత్యం సైబర్ మోసాలు మరియు రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చుగానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ "రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. 'అర్రైవ్ అ లైవ్' కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలి." జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి రహదారి భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. పూసుకుంట గిరిజన కొండరెడ్డి సమాజానికి చెందిన వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్, పాల్వంచ డిఎస్పి సతీష్, తాసిల్దార్ రామ్ నరేష్ ఎంపీడీవో రవీందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భానుడికి భయపడని నరసింహుని భక్తులు



హుజూర్ నగర్ (తెలంగాణ వాణి) ఒకపక్క భగ భగ మండుతున్న ఎండలను లెక్క చేయకుండా స్వామిని దర్శించుకోవాలన్న తపనతో భక్తులు నరసింహుని సన్నిధికి తరలివస్తున్నారు. ప్రతి శుక్రవారం లానే భక్తులు స్వామిని దర్శించుకుని తమ కోరికలను మొక్కుబడును చెల్లించుకున్నారు. అన్నదానత ఇరిగేల బ్రహ్మారెడ్డి సైదమ్మ దంపతులు మాట్లాడుతూ ఎన్నో కష్టాలతో బాధలతో ఇబ్బందులతో భక్తులు ఇంటి నుండి బయలుదేరి స్వామి వారి సన్నిధికి వచ్చాక వాటినన్నిటిని మర్చిపోయి ఎంతో సంతోషం ఇక్కడ కలుగుతుందని వారు తెలియజేశారు ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ భక్తులు ఎండల్ని దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకొని స్వామివారి సన్నిధికి రావాలని స్వామివారి కృప కు పాత్రులు కావాలని అదేవిధంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు, కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య, వీరవల్లి గురునాథం, శంకరమ్మ, కోటేశ్వరరావు, అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com